
సాక్షి
పల్నాడు
బుధవారం ౹ 14 ౹ ఆగస్టు ౹ 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ మంగళవారం సాయంత్రానికి 38.94 టీఎంసీలకు చేరింది. దిగువకు 2400 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

న్యాయమూర్తులు బదిలీ

గురజాల: గురజాల, మాచర్ల న్యాయస్థానాల పరిధిలో పలువురు న్యాయమూర్తులకు మంగళవారం రాత్రి స్థానచలనం జరిగింది. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.వి.వి.సత్యనారాయణను గురజాలలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. రంగారెడ్డి జిల్లా నాగోలు నుంచి గురజాల అదనపు సివిల్ జడ్జిగా పి.అలేఖ్యను నియమించారు. మాచర్ల కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్‌ను మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. తిరుపతి నుంచి పి.ప్రశాంత్‌ను మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు.

సుబ్రమణ్యేశ్వరునికి వెండి కిరీటాలు, హస్తాలు సమర్పణ



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రమణ్యేశ్వరస్వామికి ఐదు వెండి కిరీటాలు, హస్తాలను మంగళవారం సమర్పించారు. అమరావతికి చెందిన ఎరువుల వ్యాపారి పారేపల్లి ఈశ్వర్, నేరెళ్ల హనుమంతరావు, ధరణికోటకు చెందిన అన్నం శ్రీనివాసరావు, లింగాపురానికి చెందిన దిరిశాల కోటేశ్వరరావు, కర్నాటి శ్రీనివాసరావులు సమర్పించారు. అమరేశ్వరస్వామి వారి ఆలయంలోని సుబ్రమణ్యేశ్వరప్వామికి సుమారు 1700 గ్రాముల బరువుతో రూ.1.70 లక్షల విలువైన ఐదు వెండికిరీటాలు, రెండు హస్తాలను మంగళవారం మేళతాళాలతో దాతలు ఆలయ ప్రదక్షిణ చేసి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈవో వేమూరి గోపినాథశర్మకి అప్పగించారు. అనంతరం అర్చకులు శంకర మంచి రాజేష్‌శర్మ, రాజశేఖరశర్మలు సుబ్రమణ్యేశ్వరునికి కిరీటాలను, హస్తాలను అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి, బాల చాముండేశ్వరి, సుబ్రమణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో 286.6 మి.మీటర్ల వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలోని 28 మండలాల్లో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో 18 మండలాల్లో మొత్తం 286.6 మి.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా బొల్లాపల్లిలో 34.8 మి.మీ వర్షం కురవగా నరసరావుపేటలో 5.6, యడ్లపాడులో 5.8, చిలకలూరిపేటలో 2.2, నాదెండ్లలో 8.4, ముప్పాళ్లలో 15.4, రొంపిచర్లలో 4.4, ఈపూరులో 32.6, శావల్యాపురంలో 30.4 మి.మీటర్ల వర్షం కురిసింది. నాదెండ్లలో 28.4, వినుకొండలో 33.4, నకరికల్లులో 13.2, రాజుపాలెంలో 19.4, సత్తెనపల్లిలో 17.9, పెదకూరపాడులో 4.8, క్రోసూరులో 2.4, బెల్లంకొండలో 20.0, పిడుగురాళ్లలో 8.4మి.మీ వర్షం కురిసింది.

మేజర్ కాల్వకు నిలిచిన నీటి సరఫరా

ఇబ్బందులు పడుతున్న వరి సాగు రైతులు



కారెంపూడి: పెదకొదమగుండ్ల మేజర్ కాల్వ (పీకేజీ)కు గండి పడడం వల్ల కాల్వకు నీటిని పూర్తిగా నిలిపివేశారు. మంగళవారం గండిని జేసీబీతో పూడ్చారు కానీ నీటిని ఇంకా వదల్లేదు. సాగర్ కుడి కాల్వ నుంచి మేజర్ కాల్వ ప్రాంభమైన కొద్ది దూరంలోనే కాల్వ కట్ట తూర్పు వైపు గండి పడింది. దీంతో రెండు రోజులుగా కాల్వలో నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అందరూ నారుమడులు పోసుకుని నాట్లు వేసుకునే సమయంలో కాల్వకు నీటి విడుదల ఆపడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఓఅండ్ఎం సబ్ డివిజన్ ఏఈ బి నరేంద్ర వివరణ ఇస్తూ మెయిన్ కెనాల్‌కే వాటర్ తగ్గించారని మంగళవారం 6 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు సమాచారం ఉందని నీటిని మేజర్ కాల్వలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. గండి పూడ్చామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే కరకట్టలు బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేయాల్సిన ఆవశ్యకతతో పాటు కాల్వలలో సక్రమంగా నీరు పారేందుకు, అలాగే పిచ్చి కంప చెట్లను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. గతంలో సాక్షిలో మేజర్లు ఇలా..నీరు పారేదెలా శీర్షికన వార్త వచ్చింది. మేజర్ కాల్వ కట్ట తెగడం దీనిని స్పష్టం చేస్తోంది. మరమ్మతులు ప్రతిపాదనలున్నాయని అవి మంజూరు కాగానే అత్యవసర మరమ్మతులు చేయిస్తామని అధికారులు తెలిపారు.

పింఛన్ల తొలగింపునకు స్కెచ్

కూటమి ప్రభుత్వం కుటిల యత్నాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న అమ్మాయి పేరు పత్రా దేవమణి, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కనుమర్లపూడి గ్రామం. దేవమణికి పుట్టుకతోనే రెండు చెవుల్లో వినికిడిలోపం ఉండటంతో ప్రభుత్వ వైద్యులు పరీక్షలు నిర్వహించి 83 శాతం వైకల్యం ఉన్నట్టు దివ్యాంగ సర్టిఫికెట్ జారీ చేశారు. దాని ఆధారంగా మూడేళ్లుగా ఆ అమ్మాయికి వైఎస్సార్ పెన్షన్ కానుక కింద నెల నెలా నగదు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి దేవమణి అనర్హురాలిగా శావల్యాపురం మండలం ఎంపీడీఓ నోటీసు అందజేశారు. 15 రోజుల్లోగా వైకల్యంపై మరోసారి తాజాగా వైద్యుల ద్వారా ధృవీకరిస్తేనే పెన్షన్‌కి అర్హత సాధిస్తారంటూ నోటీసులు జారీ చేశారు. ఇలా ఒక్క దేవమణినే కాదు జిల్లాలో వందలాది పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

- పెన్షనర్లకు స్థానిక ఎంపీడీఓల ద్వారా నోటీసులు
- శావల్యాపురం మండలంలో మొదలైన ప్రక్రియ
- మండలంలో 209 మంది పెన్షన్లు పరిశీలనకు సిద్ధం
- ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా నోటీసులు
- తొలగించాలని ఫిర్యాదులు చేస్తున్న టీడీపీ నేతలు



గ్రామ సచివాలయాల వారీగా సామాజిక పింఛన్లు పరిశీలన చేస్తున్న జాబితా

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 ఏళ్లకే బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 వేల పింఛన్ నగదు అందజేస్తామని టీడీపీ–జనసేన–బీజేపీ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాయి. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని అమలు చేయకపోగా ఉన్న పెన్షన్ దారులను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన సామాజిక పెన్షన్లకు సైతం తాజాగా నోటీసులు జారీ చేసి అర్హత నిరూపించుకోవాలని లేకపోతే అనర్హులుగా ప్రకటిస్తామని రీ వెరిఫికేషన్ పేరిట ఎంపీడీఓలతో నోటీసులిస్తున్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా సుమారు 2.78 లక్షల సామాజిక పింఛన్లు ఉన్నాయి. అనర్హత పేరిట జిల్లాలో వేల సంఖ్యలో పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధమైందని సమాచారం. ఈ తంతు శావల్యాపురం మండలం నుంచి మొదలు పెట్టారు. ఒక్క శావల్యాపురం మండలంలోనే తొలి విడతలో ఎనిమిది గ్రామ సచివాలయాల పరిధిలో 209 మందికి ఎంపీడీఓ నోటీసులు జారీ చేశారు. ఇందులో వికలాంగ, ఒంటరి మహిళా, డప్పు కళాకారులు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు ఉన్నాయి. వీరందరికి ఒకేసారి నోటీసులు ఇస్తే ప్రజాగ్రహం వస్తుందని ఒక్కొక్కటిగా ఇస్తున్నారు. నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ మండలాల్లో సైతం ఇటువంటి నోటీసులు సిద్ధం చేశారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా..

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా సామాజిక పింఛన్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. గత ఎన్నికల్లో టీడీపీ ఓటు వేయని వారిని టార్గెట్‌గా ఎంపీడీఓల చేత నోటీసులు అందజేస్తున్నారు. అధికారంలో వచ్చిన వెంటనే వినుకొండ మండలం నూజెండ్ల మండలం మూర్తింజాపురంలో 12 మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు పింఛన్ నగదు పంపిణీ చేయలేదు. అందుకు గల కారణం కూడా చెప్పలేదు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. తాజాగా వారికి కూడా ఎంపీడీఓ చేత నోటీసులు అందజేస్తున్నారు.

టీడీపీ నేతల ఫిర్యాదు ఆధారంగా నోటీసులు

సాధారణంగా సామాజిక పింఛన్లను ఎటువంటి వివక్ష లేకుండా అందరి అర్హతలు పరిశీలిస్తారు. ఓ లబ్ధిదారుడికి నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి కలుగుతున్నట్లు ఫిర్యాదు అందితే అధికారులు పరిశీలిస్తారు. ఫలానా కారణం చేత మీరు అనర్హులు అని లబ్ధిదారుకు నోటీసులు ఇచ్చేవారు, లబ్ధిదారులు ఆయా విషయాలకు సంబంధించిన ఆధారాలను అధికారులకు చూపేవారు. అందుకు విరుద్ధంగా టీడీపీ నేత తమ పరిధిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల జాబితా అందజేస్తే వారందరికి అధికారులు నోటీసులు అందజేసినట్టు తెలుస్తోంది. ఒంటరి మహిళలకు నోటీసులు ఇచ్చి తహసీల్దార్ ద్వారా ధృవీకరణ పొంది ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని నోటీసులు అందజేశారు. దివ్యాంగులకు మరోసారి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించమని అడుగుతున్నారు.



ఎంపీడీఓ జారీ చేసిన నోటీసు

రాజకీయ కక్షతోనే పింఛన్లు నిలిపివేత



నాకు 2018లో పింఛన్ మంజూరైంది. అప్పటి నుంచి నగదు తీసుకుంటున్నాను. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మా గ్రామంలో నాతోపాటు 12 మంది పింఛన్లు ఆపివేశారు. కేవలం రాజకీయ ప్రోద్బలంతోనే పింఛన్లు నిలిపివేశారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి కక్షసాధింపు చర్యలు చేపట్టారు. అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోవటంతో కోర్టును ఆశ్రయించాం.

–చింతలచెర్వు నారాయణ, మూర్తింజాపురం, నూజెండ్ల మండలం.

అర్హతలున్నా నోటీసులిచ్చారు..



నాకు గతంలో నరసరావుపేట ఆసుపత్రిలో ఒకసారి, వైజాగ్ ఆసుపత్రిలో రెండోసారి నడుము, కాలికి సర్జరీలు జరిగాయి. అయినా నడవటం కష్టంగా ఉంది. నా పరిస్థితిని పరిశీలించి తుళ్లూరు సదరం క్యాంపులో వైద్యులు దివ్యాంగ సర్టిఫికెట్ అందజేశారు. దాని ఆధారంగా మూడేళ్ల నుంచి పింఛన్ పొందుతున్నాను. అన్ని అర్హతులు ఉన్నప్పటికీ ఎంపీడీఓ నాకు నోటీసులిచ్చారు.

– తిరువీధుల పెద అంజనేయులు, పిచికెలపాలెం, శావల్యాపురం మండలం

ఫిర్యాదుల ఆధారంగానే నోటీసులు

కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా ఎంపీడీఓలు నోటీసులు జారీ చేసి పరిశీలన చేస్తున్నారు. దానిపై పూర్తి సమాచారం తన వద్ద లేదు. – బాలు నాయక్, పీడీ, డీఆర్‌డీఏ

నిర్ణీత గడువులోగా పూర్తిచేయండి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: ప్రత్యేక సారాంశ సవరణ–2025కు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు సకాలంలో నిర్ణీత గడువు లోపల పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సారాంశ సవరణ, రెండు పట్టభద్రులు, ఒక టీచర్ నియోజకవర్గ ఎన్నికలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ప్రత్యేక సారాంశ సవరణ రెండు రకాలుగా చేపట్టనునట్లు ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే ప్రక్రియ బూత్ లెవల్ అధికారులు అవసరమైన రిజిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. ఫొటో నాణ్యత పెంపు, ఫారం 1 నుంచి 8 తయారు వంటివి పూర్తి చేయాలన్నారు. పెండింగ్ క్లెయిమ్‌లు త్వరితగతిన సంబంధిత అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులలో ఆర్డీవోలదే పూర్తి బాధ్యతని తెలిపారు. డీఆర్వో కె.వినాయకం, ఆర్వో, రెవెన్యూ డివిజినల్ అధికారులు పి.సరోజిని, మురళి, రమాకాంత్‌రెడ్డి, ఆర్వోలు విజయకుమార్, శ్రీరాములు, సుబ్బారావుపాల్గొన్నారు.

అడ్మిన్ అదనపు ఎస్పీ రాఘవేంద్ర బదిలీ

నరసరావుపేట: జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఆర్.రాఘవేంద్రను ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ స్థానంలో ఎవరి నియామకం జరగలేదు.



ధ్యానబుద్ధ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, విద్యార్థులు

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

అమరావతి: భారతమాతాకీ జై, వందేమాతరం అనే నినాదాలతో అమరావతి ప్రతిధ్వనించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమరావతిలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ క్రోసూరు రోడ్డు మీదుగా గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. తిరిగి క్రోసూరు రోడ్డు నుంచి ధ్యానబుద్ధ విగ్రహం వరకు కొనసాగింది. ధ్యానబుద్ధ విగ్రహం వద్ద విద్యార్థులనుద్దేశించి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలమే ఈ స్వాతంత్య్రం అని, దీనిని ప్రతి ఒక్కరూ కాపాడుకుంటూ సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకుంటూ, బాగా చదువుకుంటూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొక్కెర శ్రీనివాస్, తమ్మా వెంగళరెడ్డి, మేకల శివశంకర్, మేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుపై మండిపాటు

- పోరాటాలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ సంఘాలు
- అధికారులవి కాకిలెక్కలు

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయుల సర్దుబాటుపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు అసంబద్ధంగా ఉన్నాయని వివిధ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం కాకి లెక్కలతో సర్ ప్లస్ చూపుతోందని, సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను గందరగోళంలోని నెట్టివేశారని మండిపడుతున్నారు. ప్రభుత్వ సర్దుబాటుకు శాస్త్రీయత లేదని తేల్చివేస్తున్నారు. జిల్లా పరిధిలో 863 మంది ఉపాధ్యాయులను మిగులుగా చూపెట్టడం సరికాదన్నారు.

సర్దుబాటును రద్దు చేయాలి



ఉపాధ్యాయుల అసంబద్ధమైన పని సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలి. జీఓ 117ను రద్దు చేసిన తర్వాతనే సర్దుబాటుపై ముందుకు వెళ్లాలి. స్టేషన్ సీనియారిటీ బదులు క్యాడర్ సీనియారిటీ మార్పు చేసి ఇతర సమస్యలను పట్టించుకోకుండా సర్దుబాటుకు సిద్ధపడటం వలన అన్యాయం జరుగుతుంది.

–బి.సంపత్‌బాబు, ఫ్యాప్టో చైర్మన్

ప్రమోషన్లు ఇచ్చి సర్దుకోండి



ప్రభుత్వం చేపట్టిన సర్దుబాటు అసంబద్ధం. ముందుగా ఉపాధ్యాయుల ప్రమోషన్లు చేపట్టాలి. ఆరు వేల మంది ప్రమోషన్లు ఉన్నాయని మంత్రి లోకేష్ అసెంబ్లీలో ప్రకటించారు. ముందుగా అవి పూర్తి చేయాలి. 2023లో ప్రమోషన్లు ఇచ్చారు. మళ్లీ ఇవ్వలేదు. మండలాల వారీగా సర్దుబాటు చేయాలి.

–ఎం.శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

నాలుగు నెలలుగా జీతాల్లేవు...

- ఆయాలు, వాచ్‌మెన్లకు అందని వేతనాలు
- ఎప్పుడిస్తారో స్పష్టత కరువు
- భారంగా కుటుంబ పోషణ
- గ్లౌజులు, ద్రావణాలు లేకుండా పని జరగడం లేదు
- ఏమాత్రం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 1,663 మంది ఆయాలు, 167 మంది వాచ్‌మెన్‌లు
- జిల్లాలో వేతన బకాయిలు రూ.3.39 కోట్లు



ఫణిదంలో ప్రాథమిక పాఠశాలను శుభ్రం చేస్తున్న ఆయా

సత్తెనపల్లి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు నాలుగు నెలలుగా జీతాలు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడులో పాఠశాలలను ఆధునికీకరించారు. పాఠశాలల నిర్వహణ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడానికి రోజు రెండు పూటలా మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య వ్యవస్థను పక్కాగా ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయాలను నియమించారు. వీరికి క్రమం తప్పకుండా జీతాలు చెల్లించారు. అయితే ప్రస్తుతం వీరంతా జీతాలు రాక అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 1,830 మంది

జిల్లాలో 2,033 పాఠశాలలు ఉండగా 2,91,962 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తు న్నారు. పాఠశాలల్లో 300 మంది విద్యార్థులు ఉంటే ఒక ఆయా, 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 600 నుంచి 900 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు, 900 మందికిపైగా విద్యార్థులు ఉంటే నలుగురు చొప్పున ఆయాలను నియమించారు. ఇలా ప్రస్తుతం జిల్లాలో 1,663 మంది ఆయాలు, 167 మంది వాచ్‌మెన్‌లు పనిచేస్తున్నారు.

ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేల వేతనం

జిల్లాలో పాఠశాలలను శుభ్రం చేసేందుకు ఆయాలను, వాచ్‌మెన్‌లను ప్రభుత్వం నియమించింది. ఒక్కొక్క ఆయాకు నెలకు రూ.6 వేలు, వాచ్‌మెన్‌కు రూ.6 వేలు వేతనం గత ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అమ్మఒడి పథకం కింద ఏడాది రూ.15 వేలు నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ఇందులో స్కూల్ నిర్వహణ కింద తొలుత రూ.1,000, అనంతరం రూ.2 వేలు తల్లులు పాఠశాలకు అందించేవారు. ఆ నిధుల నుంచే ఆయాలకు వేతనాలతో పాటు మరుగుదొడ్ల పరిశుభ్రతకు ఉపయోగించే వస్తువులు, ద్రావణాలకు, ఆయాలు చేతులకు వేసుకునే గ్లౌజులకు ప్రభుత్వం ఖర్చు చేసేది. ఈ ఏడాది మార్చి వరకు ఆయాలకు వేతనం రెగ్యులర్‌గా అదింది. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల వేతన బకాయిలు పేరుకుపోయాయి.

నాలుగు నెలలుగా పస్తులు

ప్రతి నెలా రూ.6 వేలు అందుకునే ఆయాలకు వేసవి సెలవులు కారణంగా ఏప్రిల్, మే నెలలకు రూ.3 వేల చొప్పున రూ.6 వేలు రావాల్సి ఉంది. జూన్, జూలై మాసాలకు నెలకు రూ.6 వేలు చొప్పున రూ.12 వేలు మొత్తంగా ఒక్కొక్క ఆయాకు రూ.18 వేల వరకు వేతనం బకాయిలు ఉన్నాయి. వాచ్‌మన్‌కు రూ.6 వేలు చొప్పున నాలుగు నెలలకు ఒక్కొక్క వాచ్‌మన్‌కు రూ. 24 వేల వరకు వేతనం బకాయిలు ఉన్నాయి.

జిల్లాలో బకాయిలు రూ. 3.39 కోట్లు..

జిల్లాలోని 1,663 మంది ఆయాలు, 167 మంది వాచ్‌మెన్‌లకు నాలుగు నెల వేతనాలు బకాయిలు ఉన్నాయి. ఒక్కొక్క ఆయాకు రూ.18 వేలు చొప్పున రూ.2,99,34, 000, ఒక్కొక్క వాచ్‌మన్‌కు రూ.24 వేలు చొప్పున రూ.40,08,000 వెరశి మొత్తం రూ.3.39 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి. వీరికి జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. గతంలో అమ్మఒడి నిధుల నుంచి వీరి జీతాలు, ఇతర ఖర్చులను ప్రభుత్వం అందించగా .. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని ఊరించి ఈ ఏడాదికి లేదని ఉసూరుమనిపించడంతో ఆయాలు, వాచ్‌మెన్ల జీతాలు ఎలా చెల్లిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అమరావతిలో ఉద్రిక్తత

- గ్రామంలో పికెట్ ఏర్పాటు
- మోహరించిన పోలీసు బలగాలు
- ఏఎస్పీ, డీఎస్పీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ

అమరావతి: ముస్లింలపై దాడి సంఘటనతో అమరావతిలో ఉద్రిక్తత నెలకొంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో మూడుచోట్ల పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసి 144వ సెక్షన్ విధించారు. సోమవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో ముస్లింలపై కర్రలు, రాడ్లతో దాడి జరగటంతో పలువురు గాయపడ్డ విషయం విదితమే. దీంతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ రాఘవేంద్ర, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబుల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

రెండు వర్గాలపైన కేసులు

ఉదయం స్థానిక దుర్గావిలాస్ వద్ద తమపై స్థానిక టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ జానీ వర్గీయులు దాడి చేశారని లింగాపురం మాజీ సర్పంచ్ చిరుమామిళ్ల శౌరయ్య వర్గీయులు చేసిన ఫిర్యాదులో 20మందిపైన, సాయంత్రం లింగాపురానికి చెందిన చిరుమామిళ్ల శౌరయ్య వర్గీయులు చేసిన దాడిలో నేలపాటి బాజీ, షేక్ బుజ్జి, షేక్ సద్దాం, షేక్ కరీముల్లా షేక్ యాసిన్, షేక్ ఖాజావలిలపై దాడి చేసి గాయపరిచిన కేసు 27మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.



అమరావతి మసీదు సెంటర్‌లో మోహరించిన పోలీసులు

గాయపడిన వారు కోలుకుంటున్నారు

లింగాపురం గ్రామస్తుల దాడిలో గాయపడిన నేలపాటి బాజీ, షేక్ బుజ్జి, షేక్ సద్దాం, షేక్ కరీముల్లా షేక్ యాసిన్, షేక్ ఖాజావలిల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు, వారు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఎస్పీ సమీక్ష

అమరావతిలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో కేసుల నమోదు, కేసు పురోగతిపై పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమీక్షించారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనర్ బాలిక వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో 14 ఏళ్ల మైనర్ బాలిక వివాహాన్ని ఐసీడీఎస్, పోలీసులు కలిసి మంగళవారం నిలుపుదల చేశారు. గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో బాలిక ఎనిమిదో తరగతి చదువుతుంది. ఆ బాలికకు ప్రకాశంజిల్లా యువకుడితో తల్లిదండ్రులు వివాహం చేయాలని నిశ్చయించారు. ఆ బాలికను పాఠశాల నుంచి తీసుకొచ్చి వివాహం ఏర్పాట్లు చేస్తుండగా తెలుసుకున్న అధికారులు అక్కడకు వెళ్లి వివాహాన్ని నిలుపుదల చేయించారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.

ఉత్కంఠగా సాగిన హ్యాండ్‌బాల్ పోటీలు



అండర్ -19 విభాగంలో తలపడుతున్న నాగర్ కర్నూల్ -రాయచూర్ బాలుర జట్లు



అండర్ -17 విభాగంలో తలపడుతున్న షిమోగ-విశాఖపట్నం బాలికల జట్లు

- నేడు ఫైనల్స్
- విజేతలకు బహుమతులు పంపిణీ

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు రెండో రోజు రసవత్తరంగా కొనసాగాయి. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలోని జవహర్ పీఎంశ్రీ నవోదయ విద్యాలయం క్రీడా మైదానంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పోటీలకు 4 రాష్ట్రాల్లోని 8 జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యాలయాలకు చెందిన 430 క్రీడాకారులు హాజరయ్యారు. తొలిరోజు 12 మ్యాచ్‌లు జరగగా, రెండో రోజు మరో 12 మ్యాచ్‌లను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా క్రీడాకారులు తలపడ్డారు. క్రీడల్ని తిలకించేందుకు సమీప గ్రామాలకు చెందిన క్రీడాభిమానులు హాజరయ్యారు. సెమీఫైనల్స్ పోటీల్లో నాగర్ కర్నూల్, రాయచూర్, విశాఖపట్నం, షిమోగ, క్యాలికట్ జేఎన్‌వీ విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా అండర్ -14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో ఆయా పోటీలను నిర్వహించారు. పోటీలను విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు, పీఈటీ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ముగింపు సభ..విజేతలకు బహుమతులు

ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు మూడో రోజు బుధవారం కొనసాగనున్నాయి. సెమీస్ పోటీల్లో తమ క్రీడా నైపుణ్యాలను కనపరిచి ఫైనల్స్‌కు చేరిన జట్లకు బుధవారం పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు ముగించిన సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మద్దిరాల పీఎంశ్రీ నవోదయ విద్యాలయం ప్రాంగణంలో ముగింపు సభను ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మరో అతిథి పల్నాడు జిల్లా యూబీఐ రీజనల్ హెడ్ టి మాధురి తదితరులు పాల్గొంటారన్నారు. సభా కార్యక్రమం విజేతల వివరాలు వెల్లడించి అనంతరం బహుమతులు అందజేస్తారని వివరించారు.

స్వాతంత్ర్య వేడుకల్లో పొరపాట్లు ఉండరాదు

జాయింట్ కలెక్టర్ సూరజ్



స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులు ఇచ్చిన మ్యాప్ చూస్తున్న జేసీ సూరజ్

నరసరావుపేట: స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ అన్నారు. మంగళవారం అధికారులతో కలిసి సత్తెనపల్లిరోడ్డులోని కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలన్నారు. వేదిక అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా అన్నీ సరిచూసుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని చెప్పారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాలు గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించి సమన్వయం చేసుకోవాలని అన్నారు. వేడుకలకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ నాయక్, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళి



సబ్సిడీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్: సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని రావిపాడు రైతు సేవా కేంద్రంలో రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి పాల్గొని రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేజీ ఐదు రూపాయల సబ్సిడీపై రైతులకు విత్తనాలను వ్యవసాయ శాఖ అందజేస్తుందని తెలిపారు. జేజీఎల్ 384 రకానికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఎల్ 34449 రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకున్ని సంప్రదించాలని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలు రైతులు ప్రభుత్వ పథకాలను పొందవచ్చని వివరించారు. లాం ఫాం శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసి నారుమడుల పెంపకం చేపట్టడం వలన అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన విజయనగరం, గుంటూరు మ్యాచ్



సుమంత్

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం విజయనగరం, గుంటూరు జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విజయనగరం జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎస్.నివాష్ 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గుంటూరు బౌలర్లు మక్సూసూర్ ఇఫ్రాన్, జి.ఆకాష్‌లు చెరో మూడ వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 128 పరుగులకే కుప్పకూలింది. జట్టులోని జై చందు 52, శ్రీనివాస్ 31 పరుగులు సాధించారు. విజయనగరం బౌలర్ సుమంత్ 11 ఓవర్లు వేసి 28 పరుగులు ఇచ్చి 8 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన విజయనగరం జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు సాధించింది. మ్యాచ్‌ను అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ఉత్కంఠగా ప్రకాశం-ఈస్ట్ గోదావరి మ్యాచ్



5 వికెట్లు తీసిన బౌలర్ మోసెస్

మంగళగిరి: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లోగల ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్ -19మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన ప్రకాశం, ఈస్ట్ గోదావరి మ్యాచ్ ఉత్కంఠగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు 38.2 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. ప్రకాశం బ్యాట్స్‌మెన్ ఎం.మనీష్ 44 పరుగులు చేయగా కె.ఆనంద్ 41 పరుగులు చేశాడు. ఈస్ట్ గోదావరి బౌలర్ మోసెస్ 5 వికెట్లు తీసి రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఈస్ట్ గోదావరి జట్టు 32 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 119 పరుగులు చేయగా బ్యాట్స్‌మెన్ డి.ఆకాష్ 41 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రకాశం బ్యాట్స్‌మెన్ ఆర్.ప్రణదీప్ 2 వికెట్లు తీసి రాణించాడు.

చెల్లని చెక్కు కేసులో వైద్యురాలికి ఆరునెలల జైలు

మంగళగిరి: చెల్లని చెక్కు కేసులో ఓ వైద్యురాలికి ఆరు నెలల జైలు శిక్ష పడిన ఘటన చోటు చేసుకుంది. మంగళవారం బాధితుడు కె.కుమార్ తెలిపిన వివరాల మేరకు ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జంగా పద్మజ తమ కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.10లక్షల అప్పు తీసుకుని 2019లో పార్ట్ పేమెంట్ కింద రూ.6లక్షలు చెక్కు ఇవ్వగా చెక్కు బ్యాంకులో ప్రజెంట్ చేశామని, అయితే బ్యాంకులో నగదు లేక చెక్కు చెల్లలేదన్నారు. దీంతో చెక్కు బౌన్స్ కేసు వేయగా వాదోపవాదాలు అనంతరం న్యాయమూర్తి కె.సురేష్‌బాబు వైద్యురాలికి 6 నెలలు జైలు శిక్ష, రూ.6 లక్షలు కాంపన్సేషన్ చెల్లించాలని తీర్పు వెలువరించారన్నారు.

ఛాయాచిత్రాలకు అంతర్జాతీయ పురస్కారం





సుబ్బారావు తీసిన చిత్రాలు



కేసానపల్లి సుబ్బారావు

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ఛాయా చిత్రకారుడు కేసానపల్లి సుబ్బారావు తీసిన చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. ఈ నెల 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023-24కి సంబంధించి ఇమేజ్ కొలీగ్ సొసైటీ యూఎస్ఏ వారి ఫెలో సుబ్బారావును వరించింది. సొసైటీ వారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో పిక్టోరియల్ (కలర్) విభాగంలో ఒడిశా, ఛత్తీస్‌ఘడ్‌లలో తీసిన గిరిజన జీవన శైలి విధానంపై ఫొటో డాక్యుమెంటరీ పంపడం జరిగింది. ఇంటర్నేషనల్ కాలిఫక్షర్నియా వారు పరిశీలించి పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 19న పురస్కారాన్ని సుబ్బారావు అందుకోనున్నారు. సుబ్బారావును పలువురు అభినందించారు.

దూర విద్యను ప్రోత్సహించండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: దూరవిద్యను ప్రోత్సహించటం ద్వారా చదువు మధ్యలో మానివేసిన ఎంతో మందికి విద్యను అందించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. దూరవిద్య ప్రవేశాలను ప్రోత్సహించేందుకు సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, దూరవిద్య స్టడీ సెంటర్స్ నిర్వాహకులు సమావేశానికి హాజరయ్యారు. డీఈఓ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లకు రెగ్యులర్ కోర్సు సర్టిఫికెట్లకు ఉన్న గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ, పీజీ ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. ఎంసెట్, టీటీసీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొంది జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని వివరించారు. సమావేశంలో ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ, జిల్లా కోఆర్డినేటర్ కెఎంఎ హుస్సేన్, డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, వి.ఏసుబాబు, ఏఎంఓ పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి.చినరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి నేత్రాలు దానం

-గుండెపోటుతో మృతి



శ్రీహర్ష

చిలకలూరిపేటటౌన్: తమ కన్నబిడ్డ కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు వదలడంతో శోకంతో తల్లడిల్లిన ఆ తల్లిదండ్రులు.. మరొకరికి కంటిచూపును కల్పించేందుకు తమ బిడ్డ నేత్రాలను దానం చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురంలో నివసించే నాగభైరు దుర్గారావు, శ్రీహర్ష విజయ దంపతులకు ఇరువురు కుమారులు. దుర్గారావు స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. వీరి పెద్ద కుమారుడు నాగభైరు శ్రీహర్ష (23) ఇటీవల డిగ్రీ పూర్తి చేశాడు. ఖాళీగా ఉన్న సమయాల్లో గ్యాస్ ఆఫీసులో తండ్రికి సహాయపడుతూ ఉంటాడు. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో మిత్రులతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీహర్ష ఒక్కసారిగా కుప్ప కూలిపడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు ధృవీకరించారు. తమ కళ్లెదుటే కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లారు.

శోకాన్ని దిగమింగి కుమారుడి నేత్రాలు దానం

కన్నకొడుకు మృతి చెందిన శోకాన్ని దిగమింగి తల్లిదండ్రులు దుర్గారావు, విజయ దంపతులు తమ కుమారుడి రెండు కళ్లను దానం చేశారు. గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం చిలకలూరిపేట పట్టణానికి చేరుకుని శ్రీహర్ష కళ్లను సేకరించారు. శ్రీహర్ష స్నేహితులు, బంధువులు భారీ ఎత్తున చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలోని ఔత్సాహిక వ్యాపారవేత్తలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనే యువతకు జనరేట్ యువర్ బిజినెస్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. నూతన వ్యాపారం ప్రారంభించాలనుకునే యువత తమ వివరాలను ఎన్ఎస్‌పీ కాలనీలోని ఎన్ఏసీ ట్రెనింగ్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9160200652 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొన్నిసార్లు చూసీచూడనట్లు ఉండాలి!

వేటపాలెం: ఏ అధికారి అయినా కింది స్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడుతుంటే హెచ్చరించాలి లేదంటే చర్యలు తీసుకోవాలి. కానీ సాక్షాత్తు జిల్లా అధికారే ఇక్కడ చేసిన వ్యాఖ్యలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి. 'కొన్నిసార్లు చూసీచూడనట్లుగా వదిలేయండని' పేర్కొనడం వెనుక ఆంతర్యం ఏమిటో ఆయనకే తెలియాలి. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదికలో మండలంలోని తొమ్మిది గ్రామాల పరిధిలో 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన వివిధ పనులపై సోషల్ ఆడిట్ నివేదికలను సిబ్బంది చదివి వినిపించారు. ఈజీఎస్‌సీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ కింద 1,164 పనులు నిర్వహించగా.. వీటికి రూ.7.56 కోట్లు ఖర్చు చేశారు. కూలీలకు రూ. 5.24 కోట్లు వెచ్చించగా, మెటీరియల్‌కు రూ. 2.32 కోట్లు ఖర్చు చేసినట్లు చూపారు. సోషల్ ఆడిట్ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో అనేక అక్రమాలు బయటపడ్డాయి.

భారీగా అవకతవకలు

సముద్రతీర గ్రామాలైన అక్కాయిపాలెం పంచాయతీ రామాపురం, కఠారివారిపాలెం, పాపాయిపాలెం గ్రామాల పరిధిలోని సముద్ర తీరం వద్ద ఈ పథకం కింద తవ్విన చేపల చెరువుల పనుల్లో భారీగా అవకతవకలు బయటపడ్డాయి. ఈసీ చెక్ మెజర్‌మెంట్‌లు లేకుండా నగదు డ్రా చేశారు. సిమెంట్ కాల్వ పనుల్లో కొలతలు తప్పుగా చూపించి కూడా నగదు తీసుకున్నారు. గ్రావెల్ రోడ్డు వేయకుండా వేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. హాజరు పట్టికలో సంతకాలు లేకుండా కూలీలకు నగదు ఇచ్చారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన మొక్కలు నాటకుండానే నాటినట్లు, వాటికి రోజు నీరు పోస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులు తీసుకున్నట్లు ఆడిట్‌లో తేలింది. అయితే డ్వామా పీడీ సముద్ర తీర ప్రాంతంలో చేపల చెరువుల విషయంలో ఇసుక ప్రాంతం కాబట్టి కొంతమేర పూడిపోయే అవకాశం ఉంటుందని, అందువల్ల సోషల్ ఆడిట్ సిబ్బంది ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించాలన్నారు. దీంతో ఎన్ఆర్‌జీఎస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారే వారికి అనుకూలంగా మాట్లాడటంపై పలువురు విమర్శిస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

వీఐటీ - ఏపీ యాంటీ ర్యాగింగ్‌డే కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్

తాడికొండ: విద్యాసంస్థల లోపల, వెలుపల ర్యాగింగ్ నిషేధించబడినదని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తెలిస్తే వారు కళాశాల నుంచి సస్పెన్షన్‌కు గురవడంతో పాటు తొలగించడం కూడా జరుగుతుందని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ - ఏపీ విశ్వ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ర్యాగింగ్ నిషేధ చట్టం 1977 ప్రకారం విద్యార్థులను ర్యాగింగ్ అనే విష సంస్కృతితో వేధించడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు ఆ సంస్కృతిని విడనాడాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత తరం విద్యార్థులు సరైన విషయాల కోసం సమయాన్ని వెచ్చిస్తే మరింత సామర్థ్యం పెంచుకోవడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరచుకొని కెరీర్‌లో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. కానీ ఇతర విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి విద్యార్థులతో యాంటీ ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీడీ డాక్టర్ ఖాదిర్ పాషా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాఖీ, డాక్టర్ మానస్ కుమార్, డాక్టర్ కృష్ణస్వామి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.